

26న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - ఏలూరు

ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 26న శుక్రవారం ఏలూరు డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఏలూరులోని బాలయోగి సైన్స్‌పార్క్ సమీపంలోని ఏలూరు రూరల్ సబ్ డివిజన్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జెపిబి.నటరాజన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కోరారు.

సమావేశానికి కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రెస్సల్ ఫోరమ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు వి.జనార్ధనరావు, ఆర్థిక సభ్యులు ఎం.శ్రీనివాస్, స్వతంత్ర సభ్యులు డాక్టర్ ఆర్.సురేంద్రకుమార్ హాజరవుతారని కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రెస్సల్ ఫోరం కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.

'పోలవరం'పై పాతపాటే..!



- కేంద్ర బడ్జెట్‌పై జిల్లా ప్రజల్లో నిరాశ
- పోలవరం నిర్వాసితుల ఊసేలేని పరిస్థితి
- వ్యవసాయ రంగ అభివృద్ధికి అరకొర నిధులు
- రైల్వేలైన్లకు నిధులపై స్పష్టత కరువు
- వేతన జీవులకు దక్కని ఊరట

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు మొండిచెయ్యి మిగిలింది. కేంద్ర పరిధిలోని ఏఒక్క ప్రాజెక్టుకూ నిధుల కేటాయింపు సక్రమంగా లేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టుపై ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పాతపాటే పాడారు. నిధుల కేటాయింపుపై స్పష్టత ఇవ్వకుండా పోలవరం పూర్తి బాధ్యత మాదే అంటూ మాటలతో సరిపుచ్చారు. ఈసారి ఎన్‌డిఎ ప్రభుత్వంలో టిడిపి కీలకంగా మారడంతో పోలవరం ప్రాజెక్టుకు బడ్జెట్‌లో భారీగా నిధుల కేటాయింపు ఉంటుందని అంతా భావించారు. పోలవరం నిర్వాసితులకు పునరావాస పరిహారం కింద దాదాపు రూ.33 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. తొలిఫేజ్‌లో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో దాదాపు 28 గ్రామాలను తరలించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకూ తొలి ఫేజ్ నిర్వాసిత గ్రామాల్లో కూడా పునరావాస ప్యాకేజీ ఇవ్వడంగాని, ఇళ్ల నిర్మాణంగాని పూర్తి కాలేదు. నిర్వాసితులు ప్రతియేటా వరదలకు గ్రామాలు వదిలి నానాయాతన పడుతున్నారు. ఏడాదిలో మూడు నెలలు వరద బాధితులుగా అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. పోలవరం నిర్వాసితుల గురించి కేంద్రమంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో ఒక్కమాటా మాట్లాడలేదు. దీంతో నిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన పూరిస్థాయి బడ్జెట్ రూ.48 లక్షల కోట్లుకాగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు చేసిన కేటాయింపులు కేవలం రూ.లక్షా 52 వేల కోట్లు మాత్రమే. మూడు శాతం నిధులు కూడా వ్యవసాయానికి కేటాయించలేదు. ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగి వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయింది. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు పిఎం కిసాన్‌కే అత్యధికం సరిపోతాయి. మరి వ్యవసాయరంగ అభివృద్ధి ఏవిధంగా జరుగుతుందో మోడీ సర్కార్ చెప్పాల్సి ఉంది. వ్యవసాయానికి ఊతమిచ్చే బడ్జెట్ అంటూ చెబుతూ నిధుల కేటాయింపు మాత్రం అరొకరగా చేపట్టడం విశేషం. రైతులకు మద్దతు ధర అందించడంపైనా అబద్ధాలు వల్లె వేశారు. 50 శాతం మద్దతు ధర అందేవిధంగా చేశామని చెప్పుకు రావడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నిత్యావసర వస్తువుల ధరల తగ్గింపుపై ఎటువంటి చర్యలూ లేకుండాపోయాయి. బంగారం వంటి వాటిపై మాత్రం దిగుమతి పన్నులు తగ్గించడం విశేషం. బడ్జెట్‌లో వాస్తవ సాగుదారుడైన కౌలురైతుల ప్రస్తావన లేకుండా పోయింది.

రైల్వేలైన్ల నిధులపై స్పష్టత కరువు

నరసాపురం-కోటిపల్లి, కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్లకు నిధుల కేటాయింపుపైనా స్పష్టత లేకుండాపోయింది. ఈ రైల్వేలైన్లు ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కన్పించడం లేదు. విద్యారంగానికి లక్షన్నర కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ నిధులు ఏవిధంగానూ సరిపోవు. జిల్లాలో ఉన్న నిట్ రెండోవిడత అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. నిధుల లేమితో ముందుకు సాగని పరిస్థితి ఉంది. కేంద్రీయ విద్యాసంస్థల అభివృద్ధి పడకేయనుంది. ఉపాధి హామీకి నిధుల పెంపులేదు. దీంతో వ్యవసాయ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడనున్నారు. వేతన జీవులకు ఆదాయపన్ను పరిమితి రూ.ఐదు లక్షలకు పెంపుచేస్తారని ఆశించినా అదీ జరగలేదు. దీంతో వేతన జీవులు తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. కేంద్ర బడ్జెట్ అంతా మాటల గారడీ అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్రానికి అన్యాయం జరిగింది

సిపిఎం జిల్లా కార్యదర్శి రవి, ఏలూరు



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగింది. రాష్ట్రంలోని పోలవరం నిర్వాసితులు, అమరావతి రాజధాని నిర్మాణం తదితరములకు కేంద్ర బడ్జెట్‌లో బిజెపి యథావిధిగా మొండి చేయి చూపింది. నిర్వాసితులకు పునరావాసం కోసం తక్షణం రూ.12 వేల కోట్లు అవసరం అని రాష్ట్ర ప్రభుత్వం కోరగా పైసా కూడా కేటాయించకపోవడం రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న కపట ప్రేమను తెలియజేస్తుంది. టిడిపి, జనసేన నోరు విప్పి రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ప్రశ్నించి, నిధుల సాధనకు పోరాడాలి.

కార్మికులను నిరాశ పరిచిన బడ్జెట్

సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్, ఏలూరు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మికులు, చిరు ఉద్యోగులను తీవ్ర నిరాశ పరిచింది. ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికుల ఊసే లేదు. ఇపిఎస్ పెన్షనర్లు కనీస పెన్షన్ పెంచాలని చాలా కాలం నుంచి పోరాడుతున్నా కనీసం ప్రస్తావించలేదు. కార్మిక వ్యతిరేక బడ్జెట్‌ను ప్రతిఒక్కరూ తిరస్కరించాలి.

రైతాంగానికి తీవ్ర నిరాశ

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఏలూరు



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ రైతాంగాన్ని తీవ్ర నిరాశకు గురిచేసింది. రూ.48 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు కేవలం రూ.లక్ష 52 వేల కోట్లు మాత్రమే కేటాయింపు చేయడం అన్యాయం. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకొచ్చి, రైతుల రుణమాఫీ చేయాలి.

ఉపాధి హామీ కూలీలకు అన్యాయం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీకి రూ.86 వేల కోట్లే కేటాయించడం అంటే వ్యవసాయ కార్మికులు, పేదలు, బలహీన వర్గాలకు తీవ్రమైన అన్యాయం చేయడమే అవుతుంది. సంవత్సరానికి 100 రోజులు ఉపాధి హామీ పనులు జరగాలంటే కేంద్రంలో సుమారు రూ.2 లక్షల 80 వేల కోట్లు ఒక్క ఉపాధి హామీకే కేటాయించాల్సి ఉండగా గ్రామీణ అభివృద్ధి మొత్తానికి రూ.2 లక్షల 66 కోట్లు కేటాయించడం సిగ్గుచేటు.

నిరాశపరచిన బడ్జెట్

బికెఎంఎయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు



బడ్జెట్ రాష్ట్రాన్ని నిరాశపరిచింది. రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలో ఉండి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎక్కువ నిధులు కేటాయించుకోవడంలో వైఫల్యం చెందారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలకు సంబంధించి నిధులు కేటాయించలేదు. ఇప్పటికైనా సిఎం చంద్రబాబు రాష్ట్రానికి నిధుల కేటాయింపులో స్పష్టత వచ్చేలాగా చూడాలి.

నిలకడగా వరద గోదావరి

ముంపులోనే రహదారులు




వెంకటాపురం-వెంకటాపురం ఎస్‌సి కాలనీ మధ్య ప్రధాన రహదారిని ముంచెత్తిన వరద

ప్రజాశక్తి - కుక్కునూరు

మూడు రోజులుగా పెరుగుతూ విలీన మండలాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తూ వచ్చిన గోదావరి వరద మంగళవారం సాయంత్రానికి నిలకడగా ఉంది. భద్రాచలంలో ఉదయం 51.7 అడుగుల ఉన్న గోదావరి సాయంత్రానికి స్వల్పంగా తగ్గి 51.2 అడుగులకు చేరి నిలకడగా కొనసాగుతోంది. భద్రాచలంలో వరద స్వల్పంగా తగ్గినా శబరి నది ఉధృతి వల్ల మండలంలో వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే మూడు రోజులుగా దాచారం కుక్కునూరు, ముత్యాలంపాడు, వింజరం, సీతారామనగరం, వేలేరు గ్రామాల మధ్య రహదారులపైకి వరద నీరు చేరడంతోపాటు మంగళవారం వెంకటాపురం, వెంకటాపురం ఎస్‌సి కాలనీ ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరడంతో ఆయా గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఇప్పటికే గొమ్ముగూడెం, కౌండిన్యముక్తి, లచ్చిగూడెం, కుక్కునూరు ఎ-బ్లాక్‌కు చెందిన వరద బాధితులు పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న సంగతి తెలిసిందే. బెస్తగూడెం ఎస్‌సి కాలనీ చుట్టూ వరద నీరు చేరుతుండడంతో పలు కుటుంబాలు ఇల్లు ఖాళీ చేసి రావికుంట పునరావాస కేంద్రానికి తరలి వెళ్లాయి. రావికుంట పునరావాస కేంద్రంలో తలదాచుకున్న రేపాకకొమ్ము బాధితులు తాముంటున్న కాలనీలో తాగునీరు, మరుగుదొడ్లు వంటి వసతులు లేక మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. కాలనీలో విద్యుద్దీపాలు లేక రాత్రి సమయంలో అంధకారంగా ఉండటంతో పాములు, తేళ్లు వంటి విషపురుగులు తిరుగుతున్నాయని, దీంతో బయటకు రావడానికి భయపడుతున్నామని చెబుతున్నారు. తమను ఎవరూ పట్టించుకోవడంలేదని, ప్రతియేటా ఈ బాధలు పడలేమని, తమకు రావాల్సిన పునరావాస, పరిహారం ఇచ్చి తమకోసం నిర్మించిన పునరావాస కాలనీలకు తరలించాలని కోరుతున్నారు.

ప్రతియేటా ఈ బాధలు పడలేం



మాచర్ల గణపతి, రేపాకకొమ్ము బాధితుడు

ప్రతియేటా వచ్చే గోదావరి వరదలు తమ గ్రామాన్ని ఇళ్లను ముంచెత్తుతున్నాయి. ఆ సమయంలో సామగ్రి తీసుకుని ట్రాక్టర్లకు కిరాయి భరించి పునరావాస కేంద్రాల్లో తలదాచుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మేం ఇంక ఈ బాధలు పడలేము. మాకు రావాల్సిన పరిహారం ఇచ్చి పునరావాస కాలనీలకు తరలించాలి.

ఉపాధి చూపి ప్రభుత్వమే ఆదుకోవాలి



కొండపల్లి ముత్తమ్మ, గొమ్ముగూడెం బాధితురాలు

గొమ్ముగూడెం గ్రామం చుట్టూ వరద నీరు చేరడంతో మూడు రోజుల క్రితం రావికుంట పునరావాస కాలనీకి వచ్చాం. వరదలు పూర్తిగా తగ్గేవరకు పునరావాస కాలనీలోనే తలదాచుకోవాల్సి ఉంది. తమకు ఉపాధి చూపి ప్రభుత్వమే బియ్యం, నిత్యావసరాలిచ్చి ఆదుకోవాలి.

స్పిల్‌వే నుంచి 12,10,905 క్యూసెక్కుల వరద నీరు విడుదల

పోలవరం: పోలవరంలో గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. మంగళవారం సాయంత్రానికి పోలవరంలో గోదావరి నీటిమట్టం 25 మీటర్లకు చేరుకుంది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉపనదులైన శబరి, మంజీర, ప్రవర, పర్ణ, ప్రాణహిత, ఇంద్రావతి, కిన్నెరసాని, మానేరు ఉప్పొంగి ప్రవహించడంతో గోదావరి వరద పెరుగుతోంది. స్పిల్‌వే నుంచి ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న 12,10,905 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్లు ఇఇ మల్లికార్జునరావు, డిఇ మాధవరావు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 33.600 మీటర్లు, స్పిల్వే దిగువన 25.350 మీటర్లు గోదావరి నీటిమట్టం నమోదైనట్లు ఇఇలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి




ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో తీవ్ర ప్రభావాన్ని చూపాయని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. జిల్లాలో వరద ప్రభావం పూర్తిగా తగ్గేవరకూ పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. వరదల కారణంగా 10 గ్రామాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, వివిధ శాఖలకు సంబంధించి రూ.187 కోట్ల మేర నష్టం వాటిల్లిందని అన్నారు. వరద ముంపునకు గురైన కుక్కునూరు, వేలేరుపాడు గ్రామాల్లోని ఐదు వేల మంది ప్రజలను 15 పునరావాస కేంద్రాలకు తరలించి, భోజన, వసతి సౌకర్యాలు కల్పించామన్నారు. కొయిదా, కట్కూరు, నార్లవరం, రుద్రంకోట, తోటకూరగొమ్ము, రేపాకగొమ్ము, నెమలిపేట, మేడేపల్లి, రామవరం, గొమ్ముగూడెం, మాధవరం, లచ్చిగూడెం, కౌడిన్యముక్తి, తదితర గ్రామాల ప్రజలను వరద సహాయక కేంద్రాలకు తరలించాలన్నారు. 231 ఇళ్లు దెబ్బతిన్నాయన్నారు. 30 గొర్రెలు, పాడిపశువులు మృతి చెందాయన్నారు. 5305 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని, 64 హెక్టార్లలో ఉద్యానవ పంటలు నీట మునిగాయన్నారు. 333 కిలోమీటర్ల మేర రోడ్లు భవనాల శాఖ రోడ్లు దెబ్బతిన్నాయని, దీనివల్ల రూ.167 కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు. అదేవిధంగా పంచాయతీరాజ్‌శాఖకు సంబంధించి 13 రోడ్లు దెబ్బతిన్నాయని, దీనివల్ల రూ.75 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి 17 నీటివనరులు దెబ్బతిన్నాయని, రూ.మూడు కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. తాగునీటి పైప్‌లైన్లు, విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయని, అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారని అన్నారు. వరద ప్రభావిత గ్రామాల ప్రజలకు బియ్యం, కందిపప్పు, వంటనూనె, కాయగూరలు, వాటర్‌ప్యాకెట్లు, పాలు, కొవ్వొత్తులు, దోమల నిర్మూలన మందులు, బిస్కట్లు పంపిణీ చేశామన్నారు. ఇళ్లు దెబ్బతిన్న కుటుంబాలకు 800 టార్పాలిన్లు అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం వరద పరిస్థితి అదుపులో ఉందని, అయినప్పటికీ వరద ప్రమాదం పూర్తిగా తగ్గేవరకూ కేంద్ర, రాష్ట్ర విపత్తు నివారణ దళాలు, బోట్లను సిద్ధంగా ఉంచామన్నారు. వరద ప్రభావిత గ్రామాలలో విద్యుత్, సమాచార వ్యవస్థలకు ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. వరదల కారణంగా ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా గత వారం రోజులుగా జిల్లా యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసిందని, ప్రజలు కూడా సహకరించారని కలెక్టర్ తెలిపారు.

ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజుల బోర్డు పెట్టాలి

ఎంఇఒకు డివైఎఫ్ఐ వినతి



వినతిపత్రం అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజుల వివరాల బోర్డులు ప్రదర్శించాలని కోరుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యాన ఎంఇఒ బి.రాముడికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పట్టణంలో ప్రయివేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. విద్యాసంస్థల్లో కనీస భోజన వసతులు, డైనింగ్ హాళ్లు కూడా లేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని విద్యాసంస్థల్లో ఫీజు మినహా అధిక ధరలకు పుస్తకాలు యూనిఫారాలు, దుస్తులు విక్రయిస్తున్నారని, దీనిపై సంబంధిత అధికారులు స్పందించకపోవడం దుర్మార్గమని అన్నారు. తక్షణమే విద్యాహక్కు చట్టప్రకారం ప్రయివేట్ విద్యా సంస్థల నిబంధనలు బహిరంగపర్చాలని కోరారు. నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.వెంకట్రాజు, ఎన్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగానికి తక్షణ పరిహారమివ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జీవరత్నం



నీటమునిగిన వరినాట్లు చూపెడుతున్న నాయకులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

వరద ప్రభావంతో నష్టపోయిన రైతాంగానికి రూ.15 వేల నష్టపరిహారం అందజేయాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం అన్నారు. జంగారెడ్డిగూడెం మండలంలోని పంగిడిగూడెం, నాగులగూడెం, పేరంపేట గ్రామాల్లో ఎర్రకాలువ నీరు విడుదల ద్వారా వచ్చిన ఫ్లడ్ వల్ల నీట మునిగిన పంగిడిగూడెం వినాయకుడి గుడి ఉన్న ఏరియా పొలాల్లో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్ రావు కమిటీ సభ్యుల బృందం మంగళవారం పర్యటించారు. బాధిత రైతులతో పంట నష్టం అయిన ఖర్చుల వివరాలు, వారి బాధలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జీవరత్నం మాట్లాడుతూ ఎర్రకాలువ ప్రాజెక్టు వరద ప్రభావం వల్ల వచ్చిన నీరు ఐదు రోజులపాటు పొలాల్లో నిల్వ ఉండటంతో వరినాట్లు కుళ్లిపోయి పంటనష్టం వాటిల్లిందని, ఇప్పటివరకు ఒక ఎకరానికి అయిన ఖర్చు నారుమళ్లు, దమ్ములు ఊడ్చుట, కూలీల ఖర్చుల నిమిత్తం రూ.14 వేలు అయిందని తెలియజేశారు. పంటలు మునిగిపోయి ఐదు రోజులు కావస్తున్నా మండల వ్యవసాయ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పొలాల్లో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయడంలో విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. మరలా వరిపంట సాగు చేయాలంటే ఎకరాకు రూ.12 వేల వరకు ఖర్చు అవుతుందని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎకరాకు పంట నష్టపరిహారం కింద రూ.15 వేలు నష్టపరిహారం రైతులకు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదే కాకుండా పంటలకు పెట్టుబడి పెట్టి ఆర్థికంగా దెబ్బతిన్న రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు కాబట్టి తక్షణమే ప్రభుత్వాధికారులు జోక్యం చేసుకొని రైతులకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు సబ్సిడీ కింద మండలంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ ద్వారా గ్రామ సచివాలయాల ద్వారా సబ్సిడీలకు అందించాలని ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. ఈ పర్యటనలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు గుదే బాలయ్య, కె.సుబ్బారావు, పి.చంటి, రైతులు కోట నరసింహారావు, పాల రామకృష్ణ, బి.హనుమంత్, ఎం.అశోక్ కుమార్ ఉన్నారు.

జగన్ హయాంలో అరాచక పాలన : చింతమనేని

ప్రజాశక్తి - దెందులూరు

అధికార మదంతో రాష్ట్రంలో గడిచిన 5 ఏళ్లపాటు ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తూ అరాచక పాలన చేసిన జగన్‌కు రాష్ట్ర ప్రజలు రాజకీయంగా సమాధి కట్టారని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. మంగళవారం ఉదయం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో పలువురు నాయకులు, అధికారులు, ప్రజలు దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిశీలించిన ఎంఎల్‌ఎ తక్షణమే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గత 5 ఏళ్ల జగన్ పాలనలో వారి అక్రమాలు ప్రశ్నించినందుకు స్థానిక వైసిపి నాయకులు తమపై వేధింపులకు గురిచేసి, ఇబ్బందులు పెట్టారని పలువురు గ్రామస్తులు వాపోయారు. ఈ సందర్భంగా దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన చేసిన జగన్‌కి ప్రజలే తగిన బుద్ధి చెప్పారని, ఆ అక్కసుతోనే రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చేలా రాజకీయ హత్యలు అంటూ జగన్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. సొంత బాబాయ్ చనిపోతే ఏ నాడు ఆ కేసు మీద ధర్నా చేయకుండా, నిందితులను పక్కన పెట్టుకుని తిరిగే జగన్ రాష్ట్రంలో రాజకీయ హత్యలు అంటూ ధర్నాలు చేయటం హాస్యాస్పదమని మివర్శించారు. వైసిపి నాయకుల వల్ల అన్యాయంగా ఇబ్బందులు పడిన ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బొప్పన సుధా, లావేటి శ్రీనివాస్, మాగంటి నారాయణ్ ప్రసాద్(మిల్లు బాబు), నంబూరి నాగరాజు, సీనియర్ నాయకులు తాతా సత్యనారాయణ సహా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై టాస్క్ ఫోర్స్ దాడులు

తెలంగాణాకు చెందిన 3 లారీలు సీజ్

ప్రజాశక్తి - కుక్కునూరు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పంపిణీకి అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు ఇసుక అక్రమ రవాణాపై జిల్లా టాస్క్ ఫోర్స్ సభ్యులు మంగళవారం నాడు దాడులు చేసి పరిమితికి మించి లోడ్‌ను కలిగిన తెలంగాణా రాష్ట్రానికి చెందిన 3 లారీలు సీజ్ చేశారు. కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందన్న పక్కా సమాచారంతో డిపిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ బృందం పోలవరం డిఎస్‌పి, డిడి మైన్స్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు ఇసుక అక్రమ రవాణాపై ఆకస్మికంగా దాడి చేశారు. దాడిలో అనుమతి పొందిన పరిమాణంకన్నా ఎక్కువ పరిమితితో ఇసుకను తరలిస్తున్న తెలంగాణా రాష్ట్రానికి చెందిన 3 లారీలను లంకాలపల్లి వద్ద పట్టుకున్నారు. లారీలను అశ్వారావుపేటలో ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జిలో కాటా వేయించగా పరిమితికి మించి ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. లారీలను సీజ్ చేసి, లారీ యజమానులపై కేసులు నమోదు చేసినట్లు డిపిఒ తెలిపారు. ఈ విషయంపై విచారణ చేసి దోషులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు డిపిఒ తెలిపారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర

ప్రజాశక్తి - చింతలపూడి

తమ్మిలేరు రీడింగ్ విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తమ్మిలేరు రిజర్వాయర్ సిబ్బందికి జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర సూచించారు. చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం వద్ద గల తమ్మిలేరు రిజర్వాయర్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ్మిలేరు రిజర్వాయర్ ఫుల్ స్టోరేజ్ అయ్యి ఉన్నందు వల్ల ఈ సమయంలో తమ్మిలేరు చూడటానికి వచ్చే పర్యాటకుల పట్ల జాగ్రత్త వహించాలని అన్నారు. తమ్మిలేరు రిజర్వాయర్ ఎఇ ఇ.పరమానందాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమ్మిలేరు లోనికి మంగళవారం మధ్యాహ్నం సమాచారం ప్రకారం కాచ్‌మెంట్ ఏరియాలో వర్షం, ఎగువ నుంచి వస్తున్న వరద 1481 క్యూసెక్కులుగా వున్నట్లు ఎఇ తెలిపారు. రిజర్వాయర్ పూర్తి నీటి మట్టం 355 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం తమ్మిలేరు బేసిన్ 347.39 అడుగులు గాను, గొనెల వాగు బేసిన్ 347.13 అడుగులు గాను వుంది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 3 టిఎంసిలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 1.720 టిఎంసిలుగా వుందని పరమానందం తెలిపారు. కార్యక్రమంలో చింతలపూడి సిఐ ఎం.సుధాకర్, ఎస్ఐ కుటుంబరావు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : డిఇఒ

ఏలూరు అర్బన్: వర్షాకాలం నేపథ్యంలో పాఠశాలతో పాటు పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లోని పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కైకలూరు మండలంలోని తామరకొల్లు, శ్రీరామపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసి ఆ పాఠశాలలో 1వ తరగతిలో కొత్తగా చేరిన విద్యార్థుల సంఖ్యతో పాటు పాఠశాల పరిసర ప్రాంతాలు, సిలబస్, విద్యార్థుల వర్క్ బుక్స్ తనిఖీ చేసి, ఉపాధ్యాయులకు తగు సూచనలు ఇచ్చారు. అలాగే కలిదిండి మండలంలోని ఎస్.రుద్రవరం ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి ప్రాథమిక పాఠశాల ఆవరణలో పరిశుభ్రత సరిగా లేనందున సదరు ఉపాధ్యాయులకు పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. పాఠశాల ముగిసిన అనంతరం విద్యార్థులనందరినీ జాగ్రత్తగా పంపవలెనని ఆయన ఉపాధ్యాయులను ఆదేశించారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాల ఏర్పాటు

కొయ్యలగూడెం : మండలంలో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ బి.అశోక్ కుమార్ తెలిపారు. 23న పరింపూడి-1, 24న బయ్యనగూడెం-1, 25న విప్పరుపాడు, 26న ఎర్రంపేట-1, 27న రామానుజపురం గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలు కొత్తగా ఆధార్ నమోదుతో పాటు పౌరులకు సాధారణ ఆధార్ సేవలు ఇక్కడ లభ్యమవుతాయని తెలిపారు.

ముసునూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆధార్ అప్డేట్ కు ఆధార్ ప్రోగ్రాం కార్యక్రమాలను పలు సచివాలయాలు వద్ద నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవి పేర్కొన్నారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ 24వ తేదీన గోపవరం సచివాలయంలో గోపవరం, కాటన్ పాడు గ్రామస్తులకు, 25వ తేదీన ముసునూరు గ్రామ సచివాలయం నందు ముసునూరు, కొర్లగుంట, చింతలవల్లి ఆయా గ్రామ ప్రజలకు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆధార్ లోని అన్ని సేవలపైనా పేర్కొన్న గ్రామస్తులకు చేయబడునని, కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రజలను ఎంపిడిఒ కోరారు.

చాట్రాయి: ఆధార్ కార్డు అప్డేట్, నూతన ఎన్రోల్మెంట్ కార్యక్రమం మండలంలోని చనుబండ గ్రామ సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. ఈ నమోదు కార్యక్రమంలో ఆధార్ న్యూ ఎన్రోల్మెంట్ లో 16 మంది, మొబైల్ నెంబర్ లింక్ లో 14 మంది, అప్డేట్ లో 9 మంది మొత్తం 39 మంది ఈ కార్యక్రమంలో వేయించుకోవడం జరిగింది. మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఏకాంబరచారి, మహిళా పోలీస్ కిరణ్మయి, డిజిటల్ అసిస్టెంట్ బాలకృష్ణ పాల్గొన్నారు.

ఏలూరు సిటీ: జిల్లాలో ఈనెల 27వ తేదీ వరకు ఆయా ప్రాంతాల్లో ఆధార్ సెంటర్ క్యాంపులు నిర్వహించబడుతున్నాయని జిఎస్ డబ్ల్యుఎస్ ప్రత్యేక అధికారి కె.సుబ్బారావు తెలిపారు. జిల్లాలో గల 33 ఆధార్ సెంటర్లకు గాను 636 సర్వీసులు అందించబడినాయి. బయోమెట్రిక్, డాక్యుమెంట్లను అప్ డేట్ చేయుటకు ప్రత్యేక మొబైల్ క్యాంపులు నిర్వహించబడతాయని తెలిపారు.

వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వ్యకాస జిల్లా కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - కామవరపుకోట

వ్యవసాయ రంగం అభివృద్ధిలో రైతులు, వ్యవసాయ కార్మికులు జోడెద్దు పనిచేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్అండ్బి గెస్ట్ హౌస్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాస్థాయి సమావేశాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ రంగం నేడు సంక్షోభంలో పడిందన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతాంగం పరిస్థితి అధ్వాన్నంగా మారిపోయిందని తెలిపారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా స్థాయి సమావేశాలను కామవరపుకోట మండలంలో ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించాలని జిల్లా కమిటీ భావించిందని తెలిపారు. ఈ సమావేశాల సందర్భంగా గ్రామీణ ప్రాంతాల పేద సమస్యలు, హక్కులపై చర్చించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 250 మంది ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. ఈ సమావేశాలు జయప్రదానికి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జీవరత్నం, జిల్లా కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకరరావు, పిల్లి చంటి, సుధీర్ పాల్గొన్నారు.

బడ్జెట్పై హర్షం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి ప్రాధాన్యత ఇవ్వడం పట్ల చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు, పోలవరం మాజీ ఎమ్మెల్సీ చైర్మన్ పాలేపల్లి రామారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాలేపల్లి రామారావు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పడుతున్న తపన ఈ బడ్జెట్లో కనిపిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి, సంక్షేమానికి ఎంతగానో ఉపయోగపడుతుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఎన్డిఏతో పొత్తు పెట్టుకుని వెళ్లడం, ఎన్డిఏ ప్రభుత్వం ఏర్పాటులో కీలకంగా వ్యవహరించడం, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి అన్ని విధాల సహకరించాలని కోరడంతో బడ్జెట్లో రాష్ట్రానికి ఎక్కువ నిధులు కేటాయించారని, మాజీ ముఖ్యమంత్రి జగన్ అసమర్థత వల్ల గతంలో రాష్ట్రానికి నిధులు రాలేదని తెలిపారు.

ఖరీఫ్ సీజన్లో జాగ్రత్త చర్యలు తప్పనిసరి

నూజివీడు టౌన్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులు తగిన జాగ్రత్త చర్యలు చేపట్టడం ఎంతో అవసరమని వ్యవసాయ శాఖ ఉపసంచాలకులు జి.విద్యాసాగర్ సూచించారు. నూజివీడులో ఆయన మంగళవారం మాట్లాడుతూ వ్యవసాయ సాగుకు వినియోగించే విత్తనాలను అధీకృత లైసెన్స్ డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. విత్తనాల కొనుగోలుకు సంబంధించి జిఎస్టి బిల్లు తప్పనిసరిగా పొందాలన్నారు. సాగు చేసిన పంట విక్రయించే వరకూ ఆ జిఎస్టి బిల్లును రైతులు భద్రపరచాలని తెలిపారు. లైసెన్స్ లేనిదే విత్తనాలను విక్రయించిన వ్యాపార దుకాణదారులను హెచ్చరించారు. సలహాలు, సూచనలకు సమీపంలోని వ్యవసాయ అధికారులను రైతులు రైతు సేవా కేంద్రాల వద్ద పొందవచ్చునని తెలిపారు.

నరసాపురం ఎంపిడిఒ మృతికి సంతాపం

ఆగిరిపల్లి: నరసాపురం ఎంపిడిఒ ఎం.వెంకటరమణ ఆకాల మృతి పట్ల స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిడిఒ పి.శామ్యూల్ ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమం నిర్వహించి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ అబ్దుల్ సలాం, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతి

ముదినేపల్లి: మండలంలో పనిచేస్తున్న నలుగురు పంచాయతీ గ్రేడ్-3 కార్యదర్శులకు గ్రేడ్-2 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-2 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి లభించాయి. పెయ్యేరు కార్యదర్శి వై.శ్యామసుందర్, వడాలి కార్యదర్శి జి.రమేష్, చేవూరు కార్యదర్శి నాగలక్ష్మి, పెదపాలపర్రు కార్యదర్శి షహనాజ్ లకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ కమిషనర్ కె.కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు. చేవూరు, వడాలి, పెయ్యేరు, కార్యదర్శులను కృష్ణ జిల్లాకు కేటాయించగా, షహనాజ్ను ఏలూరు జిల్లాకు కేటాయించారు.

నేరాలు - ఘోరాలు

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ప్రజాశక్తి - మండవల్లి

విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన చింతలపూడిలో సోమవారం చోటుచేసుకుంది. బాధితులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇంగిపల్లి గ్రామానికి చెందిన మణి ఓంకార్ మండవల్లి మండలంలోని చింతలపూడి గోల్డ్ అప్పన్నకు చెందిన రొయ్యల చెరువుపై కాపలాదారుగా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. సోమవారం సాయంత్రం ఓంకార్ తనకున్న మేకలను కడుతుండగా ఓంకార్ పెద్ద కుమారుడైన దుర్గాప్రసాద్(14) రొయ్యల చెరువులోని ఫ్యాన్ సెట్టు తిరిగే విధంగా చేంజ్ ఓవర్ వేస్తుండగా ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. ఇది గమనించిన తండ్రి, స్థానికులు దుర్గాప్రసాద్ను 108 వాహనంలో గుడివాడ ఆసుపత్రికి తరలించగా అప్పటికే దుర్గాప్రసాద్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని బంధువులు తెలిపారు. ఈమేరకు బంధువులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ రామచంద్రరావు తెలిపారు.

చేపల వలలో చిక్కుకుని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పొట్టకూటి కోసం చేపలు పట్టడానికి వచ్చి ప్రతికూల పరిస్థితిలో చెరువులో చిక్కుకొని ఓ వృద్ధుడు మృత్యువాత పడిన సంఘటన మండల పరిధిలోని శోభనాపురం గ్రామంలో నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం చిన్న నందిగామకు చెందిన జాలరులు చేపలు పట్టేందుకు కూలీ మాట్లాడుకుని మండల పరిధిలోని శోభనాపురం గ్రామంలోని గల కంభాల చెరువులో చేపలు పట్టుచుండగా చేపల వల బలుసు స్వామి(63) కాళ్లకు చుట్టుకొని ప్రతికూల పరిస్థితులు ఏర్పడటంతో స్వామి మృత్యువాత పడటం జరిగిందన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు కలరు. మృతుని భార్య బలుసు అమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆగిరిపల్లి ఎస్ఐ పి.సురేంద్ర కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లన్నీ గోతులమయం!

ప్రమాదాల బారిన వాహనదారులు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం నుంచి గుంజవరం మీదుగా దొండపూడి వెళ్లే రోడ్డు మార్గం భారీ గోతులతో ప్రమాదకరంగా మారింది. కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరి ఎక్కడ గోతులు, ఎక్కడ రోడ్డు ఉందో తెలియని పరిస్థితుల్లో వాహనదారులు ఆ మార్గంలో ప్రయాణించి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటుకలకోట, పట్టిసీమ డెలివరీ ఛానల్ సమీపంలో మంగళవారం భారీ గోతుల్లో ఆర్టిసి బస్సు దిగబడడంతో ప్రమాదం తప్పింది. ప్రయాణీకులు బస్సుని ముందుకు తోయవలసిన పరిస్థితులు ఏర్పాడ్డాయి. పోలవరం నుంచి రేపల్లెవాడ జంక్షన్ వరకూ తొమ్మిది కిలోమీటర్ల మేర రోడ్లు కొండవాగుల దాటికి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారాయి. తానాలకుంట జంక్షన్లో ఉన్న కల్వర్టు గత ఐదేళ్ల క్రితం కొండవాగుల దాటికి సగానికి పైగా కొట్టుకుపోగా తాత్కాలికంగా రాళ్లు వేసి రాకపోకలు సాగిస్తున్నారు. కురిసిన భారీ వర్షాలకు రాళ్లు కిందకు పడి ప్రమాదకరంగా మారింది. ఇదే మార్గంలో జంగారెడ్డిగూడెం డిపో ఆర్టిసి బస్సు నిత్యం ఏజెన్సీ గ్రామాల విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు, వ్యాపారులతో ఇదే మార్గం నుంచి రాకపోకలు సాగిస్తూ ఉంటారు. అధికారులు స్పందించి రోడ్లు, కల్వర్టులు పునరుద్దరించాలని ప్రయాణీకులు కోరుతున్నారు. పోలవరం బస్ కాంప్లెక్స్ భారీ గోతులతో, అపారిశుధ్యంతో బస్సులు రాకపోకలు సాగించడానికి అనువుగా లేకపోవడం వల్ల పోలవరం వచ్చే ఆర్టిసి బస్సులు బస్టాండులోకి వెళ్లకుండానే బయట నుంచి వెనుదిరిగి వెళ్లవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. బస్టాండులో ప్రయాణీకులు వేచి ఉండడానికి కూడా సౌకర్యవంతంగా శుభ్రత లేకపోవడంతో ప్రయాణీకులు గగ్గోలు పెడుతున్నారు. రాత్రయితే బస్టాండులో మందు బాబులు మద్యం సేవించడానికి, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఆర్టిసి అధికారులు స్పందించి బస్ కాంప్లెక్స్ ఆవరణలో గోతులు పూడ్చి, బస్ కాంప్లెక్స్లో పారిశుధ్యం మెరుగుపరచాలని ప్రయాణీకులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా మారిన రోడ్డు



నూతన కమిటీ సభ్యులు

భగత్సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వినోద్

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

నూతన కమిటీ సభ్యులు భగత్ సింగ్ ఆశయాల కోసం పోరాడాలని, విద్యారంగంలోని సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు యు.వినోద్ అన్నారు. మంగళవారం కొయ్యలగూడెం గవర్నమెంట్ జూనియర్ కాలేజ్లో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు యు.వినోద్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. మండల కమిటీ ప్రెసిడెంట్గా పి.బిందు ప్రియదర్శిని, మండల కమిటీ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ, కమిటీ ఆఫీస్ బేరర్స్ యు.గౌతమ్, మండల ఉపాధ్యక్షులు సిహెచ్.చిలకమ్మా, మండల ఉపాధ్యక్షులు బి.అంజలి, మండల సహాయ కార్యదర్శి ఎం.దిలీప్ ఎన్నిక అయ్యారు.

రోడ్లు సరిగ్గా లేక రాకపోకలకు అంతరాయం

సిపిఎం మండల కన్వీనర్ శుక్లబోయిన రాంబాబు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

తుఫాను, వరదల కారణంగా కుక్కునూరు, వేలేరుపాడు మండలంలో 15 గ్రామాల రోడ్లు సరిగ్గా లేకపోవడంతో రాకపోకలు సాగడం కష్టంగా ఉందని సిపిఎం మండల కన్వీనర్ శుక్లబోయిన రాంబాబు అన్నారు. కొయ్యలగూడెం సిపిఎం మండల కమిటీ సమావేశం ఆకుల దుర్గారావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కన్వీనర్ శుక్ల బోయిన రాంబాబు మాట్లాడుతూ తెలంగాణా ప్రాంతంలో ఉన్న పెద్దవాగు ప్రాజెక్టుకి వేలేరుపాడు, కుక్కునూరు గ్రామాలు నీట మునిగి ఇళ్లు కొట్టుకుపోవడం చాలా దారుణమన్నారు. ఇళ్లల్లో సామాన్లు కొట్టుకుపోవడం వర్ణణాతీతం అన్నారు. ఆ గ్రామాల్లో ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని సిపిఎం మండల ప్రజలకు పిలుపునిచ్చింది. ఎవరికి తోచిన సహాయ సహకారాలు వస్తువుగా కానీ, బట్టల రూపేణా, ధన రూపేణా సహాయ సహకారాలు అందించాలని సిపిఎం మండల కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈనెల 24న టౌన్లో వ్యాపారస్తులు, రైతులు, కార్మికులు యావత్తు ప్రజానీకం సహాయ సహకారాల్లో పాల్గొని తమ వంతు సహకారాలను అందించాలని విజ్ఞప్తి చేశారు.



రోడ్లు వేయిస్తున్న టిడిపి నాయకులు

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముసునూరు

ఈనెల 23న ప్రజాశక్తిలో వచ్చిన 'అంతా అపారిశుధ్యం... ఆపై నిర్లక్ష్యం..!' అనే కథనానికి మండల శాఖ అధికారులు, నాయకులు స్పందించారు. మంగళవారం నాడు మండల కేంద్రమైన ముసునూరులోని బిసి ఏరియాలో రోడ్లకు ఇరుపక్కలా ఉన్న డ్రెయినేజీని ప్రోక్లైన్ ద్వారా తీయించి, రోడ్లు బాగు చేయించారు. గ్రామ సర్పంచి కొండేటి విజయలక్ష్మి బాబి, ఎంపిటిసి సభ్యులు చీలి లక్ష్మీ ఆర్లప్ప, వార్డు సభ్యులు రెడ్డి కృష్ణ, గార్లపాటి నరసింహారావు, టిడిపి నాయకులు నక్క యోహాను, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

క్షతగాత్రునికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వడాలి గ్రామానికి చెందిన కొల్లిపర బాబురావు అనే చిరు వ్యాపారి ఇటీవల కాలు జారి పడగా కాలు విరిగింది. గుడివాడ భవాని శంకర్ హాస్పటల్లో కాలికి సర్జరీ జరిగి చికిత్స పొందుతున్న బాబురావును మంగళవారం నియోజవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు పరామర్శించారు. బాబురావుకు ఏలూరు మాజీ పార్లమెంట్ సభ్యులు మాగంటి బాబు అందించిన రూ.20వేల ఆర్థిక సాయాన్ని వీరమల్లు నరసింహారావు ద్వారా అందజేయడం జరిగింది.

దోమల నిర్మూలనకు ఫాగింగ్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఈనెల 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ప్రోగ్రాంలో భాగంగా ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య(చంటి) ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులు రాకుండా మలేరియా విభాగం వారితో 13వ డివిజన్లోని వైఎస్ఆర్ కాలనీ, మరడాని రంగారావు కాలనీ, వివిఎస్ఆర్ బ్రాండ్ సిటీ, తదితర ప్రాంతాల్లో దోమల నిర్మూలనకు ఫాగింగ్ నిర్వహించారు. లార్వా నిర్మూనలకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో ఉన్న నిలవనీటిలో ఆయిల్ బాల్స్ వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవా సంస్థ భవనానికి స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

సీతామహాలక్ష్మి స్వచ్ఛంద సేవా సంస్థకు స్థలం కేటాయించాలని టిడిపి పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణను సీతామహాలక్ష్మి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు జయవరపు శేఖర్ కోరారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జంగారెడ్డిగూడెంలోని బుట్టాయగూడెం రోడ్లో సీతామహాలక్ష్మి స్వచ్ఛంద సేవా సంస్థ(వికలాంగులు, వృద్ధులు, అనాథలు) ఇంట్లోకి నీరు వెళ్లటం వల్ల చంద్ర కళ్యాణమండపంలో తలదాచుకున్నారు. మంగళవారం స్వచ్ఛందసంస్థ దగ్గరకు వెళ్లి జంగారెడ్డిగూడెం పట్టణ టిడిపి నాయకులు వారి ఇబ్బందులు చూసి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా రావూరి కృష్ణ మాట్లాడుతూ మీరు చెప్పిన విషయాన్ని ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ యాదవ్కి, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లి స్థలంతో పాటు బిల్డింగ్ కూడా నిర్మించే విధంగా తామందరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి తూటికుంట రాము, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామకుమార్, చిట్రోజు తాతాజీ, అల్లూరి రామకృష్ణ, చేను ప్రసాద్, చిట్టిబోయిన ఆంజనేయులు, అప్పికొండ సుబ్బారావు, ఊదర సుబ్బారావు, టి.రమణ, గొల్లపూడి రమేష్, సురేంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

ముమ్మరంగా పశువైద్య సేవలు

పశువులకు టీకాలు, మినరల్ మిక్స్ పంపిణీ
పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.నెహ్రూబాబు

ప్రజాశక్తి - ఏలూరు

వరద ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.నెహ్రూబాబు తెలిపారు. ఇందులో భాగంగా గత నాలుగు రోజుల్లో 121 ఆవులు, 51 గేదెలు, 132 మేకలు, 35 గొర్రెలు కలిసి 339 పశువులకు వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. అదే విధంగా మినరల్ మిక్చర్ 339 కేజీలు పంపిణీ చేశామన్నారు. వ్యాధి నిరోధక టీకాలు కింద హెచ్ఎస్-913 డోసులు, ఇటి-1046 డోసులు వేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు వేలేరుపాడు మండలం మేడేపల్లి, కోయమాధారం, రామవరం, ఉదయనగర్, గుండ్లవై, కక్కునూరు మండలం ఇసుకపాడు, గొమ్ముగూడెం, ఉప్పరమద్దిగట్ల, లచ్చిగూడెం, కౌండిన్యముక్తి గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించామని తెలిపారు.

'అగ్నివీర్ వాయు'పై విద్యార్థులకు అవగాహన

ఉంగుటూరు : నారాయణపురం శ్రీఅరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏలూరు డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్మెంట్ కెరియర్ సర్వీసెస్ విభాగం ఆధ్వర్యంలో యంగ్ ప్రొఫెషనల్ గట్టిం ప్రవీణ్కృష్ణ విద్యార్థులకు అగ్నివీర్ వాయు విభాగంలో మంగళవారం అవగాహన కల్పించారు. 17 సంవత్సరాల నుంచి 21 సంవత్సరాల లోపు స్త్రీ, పురుష అభ్యర్థులు ఇంటర్ మీడియట్లో 50శాతం పైగా మార్కులు సాధించిన వారు ఆన్లైన్లో ఈ లింక్ ద్వారా https://agnipathvayu.cdac.in రిజిస్టరు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరు తేది వచ్చేనెల 28వ తేదీ వరకూ ఉందని, దరఖాస్తు చేసుకున్న వారు పరీక్షకు హాజరుకావాలని, అగ్ని వీర్ వాయువు విభాగంలో ఎంపిక కాబడిన అభ్యర్థులకు నాలుగు సంవత్సరాల సర్వీసు చేయవలసి ఉంటుందన్నారు. మంచి జీతంతో పాటు నాలుగు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న తర్వాత పదవీ విరమణ చేసే సౌలభ్యం ఉంటుందని, 12 లక్షలకుపైగా పదవీ విరమణ గ్రాంట్ పొందవచ్చని, తరువాత ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో సెక్యూరిటీ విభాగంలో పనిచేసే అవకాశాలు ఉంటాయని, పనిచేసే నాలుగు సంవత్సరాల్లో మూడు సంవత్సరాలు అగ్నివీర్ స్కిల్ డిగ్రీ సర్టిఫికెట్ లభిస్తుందన్నారు. స్కిల్ సర్టిఫికెట్ ద్వారా ఉన్నత చదువులు, ఉన్నత ఉద్యోగాలు పొందవచ్చునన్నారు. నారాయణపురం శ్రీఅరవింద శత జయంతి డిగ్రీ కళాశాల, మహాత్మా గాంధీ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు, జూనియర్ కళాశాల ఇన్ఛార్జి ప్రిన్సిపల్ బివి.శ్రీనివాసరావు, డిగ్రీ కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి 'శిక్షా సప్తాహ'

నూజివీడు టౌన్: విద్యార్థుల్లో మరింత ప్రతిభా పాటవాలు పెంపొందింపచేసి, విద్యాభివృద్ధి సాధించే దిశగా శిక్షా సప్తాహ నిర్వహిస్తున్నట్లు ఎస్ఆర్ఆర్ జెడ్పి బాయ్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డాక్టర్ భాగవతుల హేమలత తెలిపారు. పాఠశాలలో హెచ్ఎం హేమలత మంగళవారం మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశంతో ఈనెల 22 నుంచి 29వ తేదీ వరకూ వివిధ అంశాలతో శిక్షా సప్తాహ్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న వసతి సౌకర్యాల పట్ల సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు.

చాట్రాయి: కేంద్ర ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానం 2020 సంవత్సరంలో ప్రవేశ పెట్టడం జరిగింది. దానిలో భాగంగా నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మం డలంలోని తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు శిక్షా సప్తాహ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అభ్యాసనలో నైపుణ్యాన్ని సాధించటం, సంఖ్యాశాస్త్రంలో అభివృద్ధి చెందటం, జాతీయ ప్రజాస్వామ్యంలో అభివృద్ధి చెందటం గురించి విద్యార్థులకు వివరించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. అనంతరం భారతదేశ స్వాతంత్ర సమరయోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు విద్యార్థులతో కలిసి పూలమాలలతో నివాళు లర్పించటం జరిగిందని తెలిపారు.

డిగ్రీ కళాశాలలో తిలక్, ఆజాద్ జయంతి

ప్రజాశక్తి - కామవరపుకోట

స్థానిక కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, రాజనీతి శాస్త్రం విభాగముల సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ల జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షత వహించిన కళాశాల ఇన్ఛార్జి ప్రిన్సిపల్ ఎం.మల్లేశ్వరరావు తిలక్, ఆజాద్ల చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఇన్ఛార్జి ప్రిన్సిపల్ ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ తిలక్, ఆజాద్లు ఎంతో ధైర్యంగా బ్రిటీష్ వారితో పోరాడి దేశ స్వాతంత్ర్యం కోసం కృషిచేశారని వారి త్యాగాన్ని కొనియాడారు. పొలిటికల్ సైన్స్ విభాగం అధ్యాపకుడు ధారావతు మల్లేష్ తిలక్, ఆజాద్లు నిర్వహించిన ఉద్యమ ఘట్టాలను గుర్తు చేశారు. తెలుగు అధ్యాపకుడు డాక్టర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తిలక్, ఆజాద్లను స్ఫూర్తిగా తీసుకుని ప్రతీ ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె.ఇందిరా కుమారి, ఎం.ఉషారాణి, పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు ధారావతు మల్లేష్లతో పాటు అధ్యాపకేతర సిబ్బంది అన్నపూర్ణమ్మ, రత్న సిరి, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ సేవే సహాయ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యం

టి.నరసాపురం: సమాజంలో అభాగ్యులకు అండగా ఉంటూ వారికి సాయం అందించడమే సహాయ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ ఛైర్మన్ వీరమళ్ల మధు అన్నారు. మంగళవారం మండలంలోని రాజు పోతేపల్లి గ్రామానికి చెందిన మరియమ్మ అనే నిరుపేద కుటుంబానికి కామవరపుకోటకు చెందిన సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 25 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు, కూరగాయలు అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అన్నారు. మరియమ్మ ఇటీవల కడుపులో గడ్డకు సంబంధించి ఆపరేషన్ చేయించుకుని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న తరుణంలో స్థానిక చిలకా ఏసుబాబు అందించిన సమాచారం మేరకు బియ్యం, సరుకులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. దాతలు మరియమ్మకు సహాయంగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు గోరికల వెంకట్ పాల్గొన్నారు.

తాగునీటి అవసరాలు తీర్చేందుకు చర్యలు

మండవల్లి : తాగునీటి అవసరాలు తీర్చే విధంగా గ్రామంలో ఉన్న చెరువులకు నీళ్లు నింపే విధంగా చర్యలు చేపట్టామని సర్పంచి మెండా ఝాన్సీ తెలిపారు. మొగల్రాయి, కొండరాయి చెరువుకు నీరు విడుదల చేస్తున్న విధానాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని చెరువులలో నీటిమట్టం పూర్తిస్థాయిలో పడిపోయిందని అన్నారు. అందుచేత రోజు విడిచి రోజు గ్రామానికి నీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి తోట శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, మెండా సురేష్ పాల్గొన్నారు.

నీటమునిగిన జగనన్న కాలనీ

నిడమర్రు : మండలంలోని అడవి కొలను, భువనపల్లి, ఇందిరమ్మ, జగనన్న కాలనీలు పూర్తిగా జలమయమయ్యాయి. కాలనీవాసులు బయటకు రావడానికి వీలు లేకుండా, బయటివారు కాలనీలోకి వెళ్లకుండా రహదారులు మునిగిపోయాయి. వ్యవసాయ పొలాలు, చెరువులు తలపించే విధంగా మునిగిపోయినా ఇప్పటికీ 50 శాతం నారుమళ్లు ఊడుపులు ఊడ్చడం జరిగింది. సంబంధిత అధికారుల వెంటనే పర్యటించి, పర్యవేక్షించి తగిన నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం మండల కమిటీ డిమాండ్ చేసింది.

వరిలో కాండం తొలుచు పురుగుపై అవగాహన

ప్రజాశక్తి - చాట్రాయి

వరినారు ప్రధాన పొలంలో నాటేటప్పుడు చేపట్టవలసిన సస్యరక్షణలో భాగంగా వరి నారును కొనలు తుంచి నాటాలని చీపురుగూడెం వ్యవసాయ శాఖ విఎఎ కావేరి తెలిపారు. చీపురుగూడెం గ్రామంలోని రైతులకు మంగళవారం వరినారును నారు చివర తుంచి నాటాలని తెలిపారు. దీనివల్ల కాండం తొలుచు పురుగు ఆకు చివరల గుడ్లు పెడుతుంది కాబట్టి ఇలా చేయడం వల్ల కొంతమేర ప్రధాన పొలంలో కాండం తొలుచు పురుగు ఉధృతి తగ్గుతుందని రైతులకు తెలియజేశారు.

కొనసాగిన ఐఐఐటి కౌన్సెలింగ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్జియుకెటి నూజివీడు, 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండవ రోజు జనరల్ కౌన్సిలింగ్ ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. 535 మందిని పిలువగా 446 మంది ఆర్జియుకెటి నూజివీడు క్యాంపస్కు ప్రవేశాలు పొందారు. 1050 సీట్లకు గాను 882(బాలికలు 577, బాలురు 305) మంది ప్రవేశం పొందగా 168 మంది గైర్హాజరయ్యారన్నారు. మిగిలిన సీట్లకు త్వరలో రెండవ దశ కౌన్సిలింగ్ ప్రారంభిస్తామని అడ్మిషన్స్ కన్వీనర్ ఆచార్య అమరేంద్ర కుమార్ తెలియజేశారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

కామవరపుకోట: ఇటీవల కురిసిన భారీ వర్షాల మూలంగా వచ్చిన వరద ప్రాంతాల్లో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ కామవరపుకోట మండల కార్యదర్శి టివిఎస్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏడాది పొడవునా భార్య, పిల్లలతో సహా కష్టించి పంటలు పండించే రైతులకు, దళారీ వ్యాపారులు గిట్టుబాటు ధర ఇవ్వక రైతుకు వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, క్రిమిసంహారిక మందులు, వ్యవసాయ పనిముట్లు అధిక ధరలకు కొనుగోలు చేస్తూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న రైతన్నలను ఆదుకోవాలని తెలిపారు.

వైఎస్ షర్మిలను కలిసిన ముచ్చిక సీత

పోలవరం: కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు వైఎస్ షర్మిలారెడ్డిని పోలవరం మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ముచ్చిక సీత కలిసి పోలవరం సమస్యలను వివరించినట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు, ఆర్అండ్ఆర్ సమస్యలు, ప్రత్యేక పోలవరం జిల్లా ఏర్పాటు అవసరం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నియోజకవర్గంలో పార్టీ బలోపేతం అంశాలపై వివరించడం జరిగిందని తెలిపారు.